## క్లుప్తంగా

### పండ్ల తోటల రాయితీకి దరకాస్తు చేసుకోండి

**వీపనగండ్ల:** గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వందశాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఓ శేఖర్‌గౌడ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. మామిడి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, ఆయిల్‌పాం, డ్రాగెన్ ఫ్రూట్, మునగ తోటల పెంపకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కుటుంబంలో భార్యభర్తలకు కలిపి 5 ఎకరాల లోపు భూమితో పాటు నీటి వసతి కలిగి ఉండాలని, అలాంటి రైతులు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తమ దరఖాస్తు కాపీలను అందజేయాలని సూచించారు.

### సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం



**అమరచింత:** సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ కార్మిక పక్షాన పోరాటాలు చేయడానికి సీపీఎం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి జీఎస్ గోపి అన్నారు. 139వ మే డేను పురస్కరించుకుని మండల పరిధిలోని పాంరెడ్డిపల్లిలో శనివారం సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే కేవలం సెలవు దినం కాదని, కార్మికుల శ్రమ గౌరవాన్ని ఐక్యతను సామాజిక న్యాయాన్ని గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, ఆర్ఎస్ రమేష్, మోహన్, రాజు, చంటి, నాగరాజు, అశోక్, శివకాంత్, తరుణ్, బాలకృష్ణ, చంద్రాయుడు పాల్గొన్నారు.

### పాలకుల వైఫల్యంతోనే యువశక్తి నిర్వీర్యం

**వనపర్తి రూరల్:** రాష్ట్రంలో పాలకుల వైఫల్యంతో విలువైన యువశక్తి నిర్వీర్యం అవుతుందని ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో 66వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి, ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, ఎండీ కుతుబ్ మాట్లాడుతూ.. దేశంలో అత్యధికంగా యువకులు ఉన్నా వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించి దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయటంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. యువత ఏఐవైఎఫ్‌లో చేరి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మహబూబ్, శ్రీకాంత్, చిన్నకుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

**బిజినేపల్లి:** రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తుదారులందరికి అన్ని బ్యాంకులు, కార్పొరేషన్ల వారీగా సోమవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కథలప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు మే 5న బిజినేపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వారు, మే 6న బిజినేపల్లి ఎస్బీఐ, 7న పాలెం యూబీఐ బ్యాంకు, 8న వట్టెం ఎస్బీఐ, 9న మంగనూర్ ఎస్బీఐ, 12న జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంకు వారు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులందరు తమ దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, ఆధాయం, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతాలకు చెందిన నకలు తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

### బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**కొల్లాపూర్:** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ హక్కుల పోరాట సమితి నాయకులు రాంచందర్‌నాయుడు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సమయంలో చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తి అవుతున్నా బోయల గూర్చి సీఎం మాట్లాడటం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేనిపక్షంలో బోయలను సంఘటితం చేసి ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు కురుమయ్య, శ్రీనివాసులు, రఘు తదితరులు ఉన్నారు.

### ముష్టిపల్లిలో ప్రత్యేక పూజలు

**పెద్దకొత్తపల్లి:** ముష్టిపల్లిలో ఉన్న ఆంజనేయస్వామి, చెన్నకేశవాలయం, శివాలయంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థి గాజుల వినయ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గణేష్‌రావు,శివ, రాజు, రాముడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

# ఆదాయం సమకూరేదెట్లా?

- మాంసం వ్యర్థాల సేకరణ టెండర్ గడువు పూర్తయినా రాబట్టని రూ. 19లక్షలు
- వాహనం సీజ్ చేశామని నెల రోజుల పాటు హల్‌చల్
- గత డబ్బులు రాకముందే మరో టెండర్‌కు నిర్ణయం



వనపర్తిలో చికెన్ వ్యర్థాలను సేకరిస్తున్న దృశ్యం(ఫైల్)

**వనపర్తిటౌన్:** స్థానిక మున్సిపాలిటీలో అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్లుగా మాంసం వ్యర్థాల్లోనూ మామూళ్ల కక్కుర్తి వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం రాబట్టుకోవడంలో పుర యంత్రాగం అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గత టెండర్ డబ్బులను కనీసం 50 శాతం కూడా వసూలు చేయకముందే నాలుగు రోజుల క్రితం (ఏప్రిల్ 30న) కొత్త టెండర్‌కు సన్నద్ధం కావడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చీర్ల విజయచందర్ పుర కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీయడంతో అప్పటికప్పుడు కొత్త టెండర్‌ను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించడం గమనార్హం.

**అసలేం జరిగిదంటే:**

గతంలో మాంసం వ్యర్థాలను నామమాత్రపు రుసుం చెల్లించి టెండర్ వేసేవారు. కానీ డిమాండ్ పెరగడంతో మున్సిపాలిటీల్లోని మాంసం (చికెన్, మటన్, చేపల) వ్యర్థాలను సేకరించేందుకు గత ఆగస్టులో 8 నెలల కాల పరిమితికి రూ. 29.3లక్షలకు ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకోగా, డబ్బుల చెల్లింపులో ఒత్తిడి తేవడంతో సదరు కాంట్రాక్టర్ కొన్ని రోజుల్లోనే వెనక్కితగ్గాడు. దీంతో పుర ఆదాయం రాబట్టేందుకు రూ. 29.2లక్షలకు మరో కాంట్రాక్టర్‌కు టెండర్‌ను కట్టబెట్టారు. అయితే టెండర్‌దారుడితో ఇప్పటి వరకు ఎలాంటి అగ్రిమెంటు పురపాలక యంత్రాగం చేసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. టెండర్ కట్టబెట్టిన తర్వాత రూ. 10లక్షలు రశీదు రూపంలో చెల్లించాడు. దీంతో స్థానిక టెండర్‌దారుడు గద్వాల జిల్లాకు చెందిన మరో వ్యక్తితో లోపాయికారీ ఒప్పందంతో వ్యర్థాలను సరఫరా చేసేవాడు. ఈ ఏడాది మార్చి 31తో గడువు ముగిసే రెండు నెలల ముందు వ్యర్థాలను సేకరించేందుకు గద్వాల వ్యక్తి నిరాకరించాడు. దీంతో స్థానికంగా టెండర్ దక్కించుకున్న అతడు మరో వాహనంతో ఒప్పందం కుదుర్చుకోవడంతో అనాధికారికంగా సేకరిస్తున్నారని ఆ వాహనాన్ని సీజ్ చేస్తున్నామని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. నెల రోజుల పాటు కార్యాలయంలోనే ఉంచి వారం రోజుల క్రితం చెప్పపెట్టకుండా ఆ వాహనాన్ని వదిలిపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు కాంట్రాక్టర్‌పై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగిస్తామని నెల రోజులుగా ప్రచారం చేసినా ఆ దిశగా అడుగులు వేయట్లేదు.

**రూ.2లక్షల మామూళ్లు**

టెండర్‌దారుడితో రూ. 2లక్షలకు పైబడి మామూళ్లు చేసి టెండర్ డబ్బులు కట్టపోయిన తాము చూసుకుంటామని అధికారులు, గత పాలక వర్గ సభ్యుడు మధ్య ఒప్పందం కుదిరినట్లు సమాచారం. విషయం బయటికి రావడంతో టెండర్‌దారుడి నుంచి నిబంధనల ప్రకారం డబ్బులు వసూలు చేయాలని కాంగ్రెస్ నాయకులు అధికారులతో వాదించారు. వనపర్తిలో 84 చికెన్, 24 మటన్, 15 చేపల కేంద్రాలున్నాయి. వీటి ద్వారా ప్రతి రోజు 1,500 నుండి 2 వేల కిలోల వరకు వ్యర్థాలు వస్తున్నాయి. ఆదివారం వ్యర్థాలు రోజు వారీ కంటే నాలుగు రెట్లు అధికమవుతాయి.

### కేసు నమోదు చేశాం



టెండర్‌దారుడి నుంచి రూ. 19 లక్షల వసూలు చేస్తాం. ఇందుకోసం కలెక్టర్ ఆదేశాలతో మూడు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. టెండర్ నేను బాధ్యతలు చేపట్టక ముందు జరిగింది. వాహనం సీజ్ చేశామని మా అధికారులు చెప్పేది లేకుండే. సీజ్ చేసిన వాహనం టెండర్‌దారుడిది కాకపోవడంతో యజమాని జీవనోపాధి దృష్ట్యా వదిలిపెట్టాం.

– ఎస్. వెంకటేశ్వర్లు, కమిషనర్, వనపర్తి

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

**కొత్తకోట రూరల్:** నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం పెద్దమందడి ఎస్ఐ శివకుమార్ చొరవతో మండలంలోని అమ్మపల్లికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన 10 అధునాతన సీసీ కెమెరాలను అమ్మపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన ప్రదేశాలలో కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు షాపుల యాజమాన్యాలు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో నమోదైన చాలా కేసుల్లో సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించామని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన జగదేశ్వర్ రెడ్డి, సత్యారెడ్డిని ఎస్పీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు, పెద్దమందడి ఎస్ఐ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అనాసక్తి


- ముందుకు రాని లబ్ధిదారులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఇళ్లు నిర్మించుకోమని అధికారులకు కాగితాలు రాసిస్తున్న వైనం



చింతరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ చెన్నమ్మ

**అమరచింత:** ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోమని లబ్ధిదారులు ఏకంగా గ్రామానికి వచ్చిన అధికారులకు 'ఇందిరమ్మ ఇళ్లు మాకొద్దు' అని కాగితాలపై రాసిస్తున్న పరిస్థితి మండలంలోని చింతరెడ్డిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎంపీడీఓ చెన్నమ్మ ఆధ్వర్యంలో అధికారులు శనివారం గ్రామానికి చేరుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరయిన వారితో ఇంటి నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరయిన ఐదుగురు లబ్ధిదారులు తమకు ఇళ్లు వద్దని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణం సాధ్యం కాదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. మండలంలోని చింతరెడ్డిపల్లి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా ఎంపిక చేసి 24 మంది లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. మూడు నెలల కాలంలో వీరిలో కేవలం నలుగురు మాత్రమే ఇళ్లు నిర్మించుకుంటుండగా.. మిగిలిన వారందరూ ఆసక్తి చూపడం లేదు.

## విలువైన ప్రభుత్వ భూములు కాపాడాలి



చెరువులోని ఒండ్రు మట్టి తరలింపు

**కృష్ణా:** మండలంలోని హిందూపూర్ శివారులో రోడ్డు పక్కన ఉన్న గల అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని హిందుపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న 84 సర్వే నెంబర్‌లోని అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఇటుకల బట్టీలను ఏర్పాటు చేశారన్నారు. ఈ విలువైన భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమి లేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 28న కలెక్టర్ సిక్తా పట్నాయక్ కృష్ణాకు వచ్చిన సమయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వగా.. ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. హిందూపూర్, కున్సీ గ్రామ శివారులో గల చెరువుల్లోని విలువైన ఒండ్రు మట్టిని రాత్రి వేళల్లోకి ఇటుకల బట్టీలకు తరలించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని హిందూపూర్ గ్రామస్తులు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు స్థానిక నాయకులకు ముడుపులు అందించి ప్రభుత్వ భూముల్లో ఇటుకల బట్టీలను ఏర్పాటు చేశారని మండిపడ్డారు. ఈ విషయంలో అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే గ్రామస్తుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

## సురక్షిత ప్రయాణం చేద్దాం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ఆత్మకూర్:** సురక్షిత ప్రయాణంతో క్షేమంగా ఉంటామని, వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులకు, ప్రయానికులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్‌లో మద్యం తాగరాదని, ఇన్సూరెన్సు, నంబర్‌ప్లేట్లు ఉండాలని, తదితర విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రోషయ్య, హెచ్‌సీలు బాలీశ్వర్‌రెడ్డి, రవీందర్, సిబ్బంది బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, రాములు, వాహనదారులు, ప్రయానికులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

**గోపాల్‌పేట:** భూ భారతి చట్టానికి సంబంధించి జిల్లాలోని గోపాల్‌పేట మండలాన్ని పైలట్ మండలంగా గుర్తించారని తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యలు పరిష్కరించేందుకు రెండు టీంలు ఏర్పాటు చేశారని, ఈ నెల 5 నుంచి 13 వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో అధికారులు సందర్శించి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. 5న చెన్నూరు, జయన్న తిర్మలాపూర్, 6న తాడిపర్తి, మున్ననూరు, 7న చాకల్‌పల్లి, పొలికెపాడు, 8న ఏదుట్ల, పొలికెపాడు, 12, 13న గోపాల్‌పేట, బుద్దారం గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. పాస్‌బుక్‌లో సర్వే నంబరు ఎక్కలేదు, సవరణ, నిషేధిత జాబితాలో ఉండటం, పట్టా హక్కుల గురించి ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

## దళితులపై దాడులు సరికాదు

**కొల్లాపూర్ రూరల్:** సిద్దిపేట జిల్లా ఎల్లదాసు గూడెం, చేర్యాల మండలంలోని వేచరేని గ్రామాలలో బుడగ సంఘాల కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి గుడిలోకి వెళ్లడాన్ని దళితుడైన అజయ్‌ని అక్కడున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు అకారణంగా కొట్టి చిత్ర హింసలకు గురి చేశారని, వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని శిక్షించాలని దళిత దండు రాష్ట్ర అధ్యక్షులు బచ్చలకూర బాల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన రామాపురంలో దళిత దండు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభుది అజయ్, తల్లి లక్ష్మమ్మలకు ఇద్దరికి మతిస్థిమితం లేదన్నారు. వారికి ఉండడానికి ఇల్లు కూడా లేదన్నారు. వారు ఆంజనేయ స్వామి గుడిలోకి వెళ్లారని వారిని బీజేపీ నాయకులు అకారణంగా దాడులు చేసి కులంపేరుతో దూషించడం జరిగిందన్నారు. దాడులు చేసిన వారిని గుర్తించి వారిని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బుడగ జంగాల జాతీయ అధ్యక్షులు కోడిగంటి నరసింహ, నాయకులు మల్లేల వెంకటేష్, నరసింహ, రవి, తదితరులు ఉన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



**ఖిల్లాఘనపురం:** ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులకు చెస్, క్యారమ్స్, షటిల్, రింగ్‌బాల్ తదితర ఆటలను ఆడించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతు విద్యార్థుల బాగుకోసమే మండలంలోని సోళీపురం, మామిడిమాడతో పాటు ఖిల్లాఘనపురం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు విద్యార్థులు శిబిరానికి వెళ్లి చదువుతో పాటుగా ఆటలు, పాటల్లో ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కాశీదాస్, మునావర్ సుల్తానా, చైర్మన్ రాజేశ్వరి, వలంటీర్లు పద్మ, శిరీష, దేవేందర్, సుమలత, సీఆర్పీ వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

**ఖిల్లాఘనపురం:** మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో శనివారం బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. త్వరలోనే దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలోనే బీసీ గణన చేసేందుకు ప్రధానమంత్రి ముందుకు రావడం శుభపరిణామం అని మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అన్నారు. దేశంలోని బీసీలందరికీ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన చెప్పారు. దీంతో బీసీల్లోని కులాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయంగా కూడా ఎమ్మెల్యే స్థానాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు సత్యనారాయణ, దశరథం, గోపాల్‌రెడ్డి, ఆశన్న, వెంకటేష్, రాంచదంర్, గోపి ముదిరాజ్, బెస్త శ్రీనివాసులు, టైలర్ గోపాల్, శాంతమ్మ, శివ, రాజు, మల్లయ్య, తిరుపతిరెడ్డి, మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉద్యమాలతోనే సెలవులు సాధించాం'



వీపనగండ్లలో సంబరాలు చేసుకుంటున్న అంగన్‌వాడీలు

**వీపనగండ్ల:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లు సమష్టి ఉద్యమాలు నిర్వహించడంతోనే మే నెలలో సెలవులను సాధించుకోగలిగారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా మే నెల మొత్తం సెలవు దినాలుగా ప్రకటించడంతో కేక్ కట్ చేస్తూ మిఠాయిలను పంచిపెట్టారు. సెలవులు ప్రకటించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్నోమార్లు విజ్ఞాపన పత్రాలు అందజేస్తూ టీచరర్లు, హెల్పర్లను నిరసనల వైపుకు మళ్లించి సమష్టిగా ఉద్యమాలు చేపట్టామని, దీని ఫలితంగానే సమస్యలు పరిష్కరించుకోగలిగామని, సెలవులు ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో నెలకొన్న అనేక సమస్యలను మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని రాబోయే రోజుల్లో మరిన్ని సమస్యలు పరిష్కారం కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మురళి, మండల అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు సుగుణాబాయి, మాధవి, సువర్ణ, కృష్ణమ్మ, హెల్పర్లు నిరంజనమ్మ, లచ్చమ్మ, కృష్ణవేణి, జయంతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బొబ్బిలి నిక్సన్

**కొత్తకోట:** మున్సిపల్ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో పని చేసే కార్మికులకు, జీపీ కార్మికులకు మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. రాష్ట్రం రెండో పీఆర్సీలో కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ శాఖలోని వివధ విభాగాల్లో పనిచేస్తున్న వారి చదువు, వృత్తి నైపుణ్యతను గుర్తించి జవాన్లుగా, డ్రైవర్లుగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా మొదటి ప్రాధాన్యత ఇచ్చి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెంకటయ్య, నోవెల్, జాన్సన్, పెద్ద రాజు, ప్రసాద్, ఎర్రన్న, శిరీష, సరళ, సుశీలమ్మ, మన్నెమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్లకు డబ్బులు వసూలు



మామిడిమాడలో వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్

**ఖిల్లాఘనపురం:** మండలంలోని మామిడిమాడ గ్రామంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసమని తమ నుంచి డబ్బులు వసూలు చేశారని గ్రామానికి చెందిన 12 మంది దళితులు తహసీల్దార్ సుగుణకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ఇటీవల తిరిగి ప్రారంభించారు. వీటి లబ్ధిదారుల ఎంపిక విషయంలో నిర్మాణాలు పూర్తయిన తర్వాత లాటరీ పద్ధతిలో ఎంపిక చేయాల్సి ఉంది. కానీ గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీకి చెందిన నాయకుడు డబ్బులు ఇస్తే ఇళ్లు కేటాయిస్తామని చెప్పి తమతో డబ్బులు వసూలు చేశారని కొందరు దళితులు పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలనలో భాగంగా శనివారం తహసీల్దార్ సుగుణ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్ గ్రామానికి వచ్చిన విచారణ చేశారు. డబ్బులు ఇచ్చిన దళితులు నేరుగా అధికారుల ముందుకు వచ్చి నిర్ధారించారు. డబ్బులు ఎవరికి, ఎంత ఇచ్చింది రాతపూర్వకంగా ఇవ్వాలని కోరగా.. 12 మంది ముందుకు ఓ కాగితంలో రాసి సంతకాలు చేసిచ్చారు. డబ్బులు ఇచ్చినట్లు గ్రామస్తులు రాసి ఇచ్చిన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని వారికి తహసీల్దార్ హామీ ఇచ్చారు.

### ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



**మల్దకల్:** ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, సిబ్బంది గురునాథ్, ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రెండు బైక్‌లు ఢీ: వ్యక్తికి గాయాలు

**వనపర్తి రూరల్:** రెండు బైకులు ఢీకొట్టుకోవడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన శనివారం రాత్రి పట్టణంలోని గాంధీచౌక్ పెట్రోల్ బంక్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేట మండలంలోని మున్ననూర్ గ్రామానికి చెందిన కురుమూర్తి బైక్‌పై వస్తుండగా.. పట్టణంలోని గాంధీచౌక్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టుకొట్టుకున్నాయి. దీంతో కురుమూర్తికి గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిచారు.

### గురుకుల పాఠశాల మరమ్మతు ప్రారంభం



**మదనాపురం:** మండల కేంద్రంలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మరమ్మతులకు శనివారం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట్‌నారాయణ, మాజీ సర్పంచ్ వేమన్న, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీను, బాలస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విజయ్, వడ్డె రాజు, మేస్త్రీ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

**మానవపాడు:** అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో శనివారం చర్చించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, ప్రధాన సమస్యలపై నాయకులతో చర్చించారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటినాయుడు, డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్, మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, భరత్ భూషణ్‌రెడ్డి, రామానాయుడు, కృష్ణయ్య, గాండ్ల రమేష్, పరమేష్‌నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.